

## ఒకటో తరగతి ఫీజు రూ.7.35 లక్షలు



- రసీదును సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తల్లిదండ్రులు

7

- భారీ మొత్తంపై ఆశ్చర్యం



ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న బెంగళూరు గ్రామీణ రహదారి (ఫైల్)

# నిధులన్నీ మళ్లింపే..!



- సంక్షేమం సరే.. అభివృద్ధి ఏదీ..? ● మౌలిక సదుపాయాలకు గ్రాంట్ల కొరత ● కనీస సౌకర్యాలూ కరువు ● తప్పనిసరి ఖర్చులకు అదనంగా రూ.31,144 కోట్లు ● కాగ్ నివేదికతో కలవరం

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వాలు కొనసాగినా మౌలిక సదుపాయాల అభివృద్ధికి తగినరీతిలో గ్రాంట్లు కేటాయించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాక తప్పనిసరి ఖర్చులకు ఐదేళ్ల క్రితంతో పోలిస్తే రూ.31,144 కోట్లు అదనంగా భరించాల్సి వచ్చింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ప్రతి సంవత్సరం బడ్జెట్ గాత్రం పెరుగుతోంది. అభివృద్ధికోసం తగినంత గ్రాంట్లు లేకపోవడంతో తప్పనిసరి ఖర్చుల కోసం అప్పుల ప్రమాణం కూడా పెరుగుతుండడం కలవరపెడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోంది. గ్యారెంటీ పథకాలకోసం ఏడాదికి 50వేల కోట్లరూపాయలకుపైగా ఖర్చు చేస్తోంది. శక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుండగా, గృహజ్యోతి పథకం ద్వారా ఇళ్లకు ఉచిత విద్యుత్, గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి యజమానురాలికి రూ.2వేలు, అన్నభాగ్య పథకం ద్వారా 5కేజీల ఉచిత బియ్యంతోపాటు యువనిధి పథకం ద్వారా నిరుద్యోగ యువతకు భృతి ఇస్తున్నారు. గ్యారెంటీ పథకాల కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు వస్తుండడంతో ఇతరశాఖల నిధులు సైతం వీటికి మళ్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.


**మూలధన వ్యయం రూ.కోట్లలో..**

| సంవత్సరం | అంచనా | వాస్తవ ఖర్చు |
|---|---|---|
| 2019-20 | 42,584 | 35,530 |
| 2020-21 | 46,512 | 45,406 |
| 2021-22 | 44,238 | 47,874 |
| 2022-23 | 46,441 | 57,349 |
| 2023-24 | 54,374 | 52,120 |

### తగ్గిన మూలధన వ్యయం

(కేపిటల్ ఎక్స్‌పెండిచర్) మూలధన వ్యయం తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు, బ్రిడ్జ్, భవనాలు, నీటి పారుదల సహా ఇతర మౌలిక సదుపాయాలు కోసం కేటాయిస్తున్న గ్రాంట్లు తక్కువగా ఉండడంతో అభివృద్ధి ప్రమాణం కూడా తక్కువగా ఉంది. 2019-20 నుంచి 2022-23వరకు గ్రాంట్ల ప్రమాణం నిరంతరంగా పెరిగింది. 2022-23లో అంచనా రూ.11వేల కోట్లు ఉండడం గమనార్హం. గత రెండేళ్ల వివరాలను పరిశీలిస్తే ఇలా. ఉన్నాయి. 2022-23లో రోడ్డు - బ్రిడ్జ్‌లకు రూ.12,706 కోట్లు, మధ్యతరహా నీటి ప్రాజెక్టులకు రూ.17,989 కోట్లు, నగరాభివృద్ధికి రూ.5,818 కోట్లు, ప్రజాపనులశాఖకు రూ.1,037, నీటి సరఫరా, డ్రైనేజీకి రూ.911 కోట్లు ఖర్చు చేశారు. 2023-24లో రోడ్డు - బ్రిడ్జ్‌లకు రూ.8,760, మధ్యతరహా నీరావరికి రూ.14,655కోట్లు, నగరాభివృద్ధికి రూ.297 కోట్లు, ప్రజాపనులశాఖకు రూ.2,338 కోట్లు, నీటి సరఫరా, డ్రైనేజీకి రూ.5,981 కోట్లు ఖర్చు చేశారు. 2022-23తో పోలిస్తే 2023-24లో నగరాభివృద్ధిశాఖకు 10శాతం కంటే తక్కువ ఖర్చు చేయడం గమనార్హం.

### నిధుల కొరతపై ఎమ్మెల్యేల అసంతృప్తి



నియోజకవర్గాల అభివృద్ధి పనులకోసం రెండేళ్ల గడిచినా కనీసంగా మంజూరు చేయడం లేదని గ్రాంట్లు విడుదల చేయాలని అధికార, ప్రతిపక్ష సభ్యులు సైతం ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. గ్రామాలలో కనీస సదుపాయాలు కల్పించలేకపోతున్నామని సభ్యులు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. ఈ తరుణంలో దీంతో కొంతమందిసభ్యులకు నామమాత్రంగా నిధులు విడుదల చేశారు. ఈ అంశంపై పలుమార్లు చర్చనీయాంశమైంది. గ్యారెంటీ పథకాలకే ప్రాధాన్యం ఇవ్వడంతో ఇతర అభివృద్ధి పథకాలు కుంటుపడ్డాయనే విమర్శలు ఉన్నాయి. రోడ్డు, చిన్నపాటి కల్వర్టులు, బ్రిడ్జ్‌లు, నీరావరి, నగరాభివృద్ధి పనులకు తగినంత గ్రాంట్లు మంజూరు కావడం లేదని ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యులు బహిరంగంగా విమర్శలు గుప్పించారు.

### గ్యారెంటీల ప్రభావం

2023-24లో మూలధన వ్యయం రూ.53,347 కోట్లు అంచనా ఉండగా బడ్జెట్‌లో రూ.52,120 కోట్లు ఖర్చు చేశారు. అయితే 2022-23తో పోలిస్తే 5,229 కోట్లు మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాలకు తక్కువగా ఖర్చు చేశారు. దీనికి కారణం గ్యారెంటీ పథకాల భారమే కారణమని నివేదికలో ప్రస్తావించారు. ఆర్థికత అభివృద్ధి దిశగా ఉన్నప్పటికీ తప్పనిసరి ఖర్చుల ప్రమాణం తక్కువగా ఉండగా, గ్రాంట్ల ప్రమాణం పెరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అత్యవసరంగా తీసుకోవాల్సిన అంశాలను నివేదికలో కొన్నింటిని సిఫారసు చేసింది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలకోసం తగిన ప్రాధాన్యం ఇచ్చి గ్రాంట్లు పెంచాల్సి ఉంది. మరి ఏమేరకు సాధ్యమవుతాయో వేచి చూడాలి.

**తప్పనిసరి ఖర్చుల వివరాలు రూ.కోట్లలో..**

| మూలం | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|---|
| వేతనాలు | 33,186 | 33,832 | 37,674 | 40,663 | 45,906 |
| పింఛను | 18,404 | 18,936 | 20,666 | 24,020 | 24,859 |
| వడ్డీ చెల్లింపులు | 19,903 | 23,433 | 26,276 | 29,643 | 31,872 |
| మొత్తం | 71,493 | 76,201 | 84,589 | 94,326 | 1,02,637 |

### బయటపడ్డ లోటుపాట్లు

2023-24 సంవత్సరం చివరినాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి అకౌంటెంట్ జనరల్ నివేదిక ఇటీవల శాసనసభ సమావేశాల్లో అందజేశారు. గ్యారెంటీ పథకాల అమలు తర్వాత రుణాల ప్రమాణం పెరగడం ఆందోళన కలిగించే అంశం. మౌలిక సదుపాయాలకై మూలధనం వ్యయంలో రూ.5,299 కోట్లు కోత విధించడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాక తప్పనిసరి ఖర్చును నియంత్రించడంతోపాటు అభివృద్ధి పథకాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని నివేదికలో ప్రస్తావించబడింది.

### తప్పనిసరి ఖర్చుల భారం

తప్పనిసరి ఖర్చులుగా ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛను, ప్రభుత్వ రుణాలకు వడ్డీ ప్రమాణం పెరుగుతోంది. 2019-20లో రూ.71,493 కోట్లు, 2023-24లో రూ.1.20 లక్షలకోట్లు ఖర్చు అయ్యాయి. ప్రభుత్వం ప్రతి సంవత్సరం చేస్తున్న అప్పుల ప్రమాణం పెరుగుతోంది. దీనిపై వడ్డీ భారం కూడా అధికమవుతోంది. 2019-20లో వడ్డీగా రూ.19,503 కోట్లు చెల్లించారు, ఐదేళ్లలో రూ.31,872 కోట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

### సిఫారసు చేసిన అంశాలు

పెండింగ్‌లో ఉన్న ఆదాయ వనరుల సేకరణపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ ఖర్చులను నిభాయించడానికి పన్నుయేతర వనరులపై దృష్టి సారించాలి. ప్రభుత్వం ఖర్చులను నిభాయించడానికి పథకాలను గడువులోగా వేగిరంగా అమలు చేయాల్సి ఉంటుంది. పెండింగ్ పనులను పూర్తి చేయడానికి తగిన మార్గదర్శకాలు పాటించాలి.

## అలెమారి వర్గానికి అన్యాయం

- ఎస్సీ వర్గీకరణపై మాజీ మంత్రి ఆంజనేయ



బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులవర్గీకరణ రిజర్వేషన్లలో అలెమారి సామాజికవర్గానికి అన్యాయం జరిగిందని మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. మంగళవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయమూర్తి ఏజే సదాశివ కమిషన్ నివేదిక ఆధారంగా రిటైర్డు న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. కమిషన్ ఆధ్వర్యంలో సమీక్ష శాస్త్రీయంగా జరిగిందన్నారు. అలెమారి సామాజికవర్గం అత్యంత వెనుకబడినదిగా గుర్తించి వారికి ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలని ప్రతిపాదించారన్నారు.

## వర్మ అర్జీని కొట్టేసిన హైకోర్టు

- వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతి ఆరోపణలు

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'తనపై నమోదైన క్రిమినల్ కేసును రద్దు చేయాలని' కోరుతూ వాల్మీకి ఎస్టీ అభివృద్ధి మండలిలో అవినీతికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ వర్మ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. వర్మ సమర్పించిన రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఎం నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం సోమవారం తన తీర్పును ప్రకటించింది. కీలకమైన ఆరోపణల కేసుల్లో పూర్తిగా విచారించక ముందే నీతివంతులమనే తరహాలో వ్యవహరించడం తగదన్నారు. సత్యనారాయణపై పలు సెక్షన్లకింద చార్జ్‌షీట్ నమోదైందన్నారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ బీఎన్ జగదీశ్, మండలి తరపున సీనియర్ న్యాయవాది విక్రమ వాదనలు వినిపించారు.



## అమ్మకం రూ. 25 అన్నదాతకు రూ. 5

- వర్షాలకు దెబ్బతిన్న ఉల్లిపంట ● ధరలు తగ్గించిన వ్యాపారులు ● రవాణా ఖర్చులు కూడా రావని రైతుల ఆవేదన



కుడితిని సమీపంలో ఉల్లిపాయలను వేరుచేస్తున్న కూలీలు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉల్లి రైతు పరిస్థితి దారునంగా తయారయ్యింది. బహిరంగ మార్కెట్లో ధరలు బాగున్నాయని ఆశపడి అమ్మకానికి తరలిస్తున్నారు. వ్యాపారులు కొనే ధరలు భారీగా పడిపోయాయి. దీంతో కనీసం రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు జిల్లాల్లో ఉల్లికోత ప్రారంభమైంది. అయితే పంట చేతికొచ్చే సరకి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 50కిలోల సంచిని రూ.100నుంచి 500వరకు అమ్ముతున్నారు. దీని వల్ల రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. మధ్య కర్ణాటకలో ఉల్లిపాయ ముఖ్యమైన వాణిజ్య పంట, మంచి ధరలు లభిస్తే గణేశ్ పండుగ ఆనందంతో జరుపుకోవాలని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. గత సంవత్సరం ఇదే సమయంలో ప్రతి సంచి రూ.1,600 నుంచి రూ.3,450 వరకు ధరలు పలికింది. ఈసారి కిలో కేవలం రూ. 10కి అమ్ముతున్నారు. ఈసీజన్‌లో జిల్లాలో 40,000 హెక్టార్లలో ఉల్లి సాగు చేశారు. స్థానికంగా డిమాండ్ తక్కువ ఉండడంతో రైతులు అద్దె వాహనాల్లో బెంగళూరులోని యశ్వంత్‌పూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో 4కిలోల ఉల్లిపాయలు రూ. 100కు అమ్ముతున్నారు. సూపర్ మార్కెట్లలో రూ.35అమ్ముతున్నారు. సంచి ఉల్లిపాయను పండించడానికి రూ. 800 ఖర్చవుతుంది, రవాణా ఖర్చులతో సహా రూ. 1000కంటే ఎక్కువ ఖర్చవుతుంది, దీనిలో సగం కూడా మీకు లభించకపోతే మీరు ఎలా జీవిస్తారు అని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కోతకు సిద్దంగా ఉన్న ఉల్లిపాయల నాణ్యత క్షీణించింది. పంట దెబ్బ తినడంతో మరింత తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన ఉల్లి



గజరాజుపై ఊరేగుతున్న వినాయకుడు

## గజరాజుపై గజాననుడు

- అంబారీపై నిమజ్జనానికి తరలిన వినాయకుడు

దొడ్డబళ్ళాపుర, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తూబగెరెలో గణేశ నిమజ్జనోత్సవం ఈసారి విశిష్టంగా సాగింది. తూబగెరె చావడి గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో తూబగెరె పట్టణ చరిత్రలో తొలిసారి గణేశుడిని అంబారీపై ఊరేగించారు. మంగళవారం సాయంత్రం భారీ ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక, నాదస్వర, కళాబృందాలు ఆకట్టుకున్నాయి. మైసూరు దసరా ఏనుగు తరహాలో గజరాజును ముస్తాబు చేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మునియప్ప, గ్రామపంచాయతీ సభ్యుడు కృష్ణప్ప (కిట్టి), చావడి అధ్యక్షుడు మధు, ఘాటి సుబ్రమణ్య ప్రాధికార సభ్యుడు రంగప్ప, బీజేపీ అధ్యక్షుడు అంబరీశ్ గౌడ, బీజేపీ నాయకుడు వాసుదేవ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం

- మంత్రి దినేశ్ గుండూరావు ● ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహారం ● ఆరోగ్యశాఖ, ఇస్కాన్ సహకారంతో భోజనం

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలే లక్ష్యంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, రాష్ట్ర ప్రభుత్వం, ఇస్కాన్ బెంగళూరు సహకారంతో నగరంలోని మూడు ప్రధాన ఆసుపత్రుల్లోని ఇన్‌పేషెంట్ రోగులకు పౌష్టికాహారం అందించే కొత్త పథకానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందిరానగర్‌లోని సర్ సీవీ రామన్ జనరల్ ఆసుపత్రిలో మంత్రి దినేశ్ గుండూరావు రోగులకు స్వయంగా ఆహారాన్ని అందజేశారు. ఆరోగ్యశాఖ కమిషనర్ ఎస్ రఘు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదే వేళ జయనగర్ జనరల్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే సీకే రామూర్తి, ఇతర అధికారులతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా మల్లేశ్వరంలోని కేసీ జనరల్ ఆసుపత్రి, సర్ సీవీ రామన్ జనరల్ ఆసుపత్రి, జయనగర్ జనరల్ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందించనున్నారు. సాధారణ ఆహారం, చికిత్సలకు తగిన ఆహారం, గర్భిణీ, బాలింతల ఆహారం, షుగర్ పేషంట్‌లకు ఆహారం, పిల్లలకు తగిన ఆహారం ఇవ్వనున్నారు. సాధారణ రోగులకు సుమారు 2200 క్యాలరీలు, 70 గ్రాముల ప్రొటీన్, బాలింతలకు 1800-2400 క్యాలరీలు, 60-69 గ్రాముల ప్రొటీన్ ఉండే ఆహారాన్ని ఇవ్వనున్నారు. పిల్లలకు 1300-1400 క్యాలరీలు, 40 గ్రాముల ప్రొటీన్ ఉండేలా ఆహారం ఉంటుందని అధికారులు తెలిపారు. మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రోగులు త్వరగా కోలుకుంటారని, వారికి మెరుగైన ఆరోగ్యం కల్పించడమే లక్ష్యమన్నారు. తల్లీబిడ్డలకు ఎంతో మేలు కానుందన్నారు. ఇస్కాన్ బెంగళూరు సంస్థ అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. సుదీర్ఘ అనుభవం కల్గిన సంస్థ సమకారం మరువలేమన్నారు. రానున్న రోజుల్లో ఇస్కాన్ ఇతర జిల్లా ఆసుపత్రులకు కూడా విస్తరించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



సీవీ రామన్ జనరల్ హాస్పిటల్‌లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు

**వైభవంగా ప్రణవజ్యోతి**

# మహా రథోత్సవం

- హాజరైన పలువురు పీఠాధిపతులు
- అలరించిన కళాకారుల ప్రదర్శనలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలో విశ్వారాధ్య గురుకుల మఠం 47వ వార్షిక సందర్భంగా ప్రణవజ్యోతి మహారథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మఠం నుంచి ప్రారంభమైన మహారథోత్సవం గ్రామంలోని ప్రధాన రోడ్డు మీదుగా బసవన్న కట్ట వరకు వెళ్లి, ఆపై మఠానికి తిరిగి వచ్చింది. భక్తులు రథానికి పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొప్పళ జిల్లాలోని చిలకముఖి గ్రామానికి చెందిన శ్రీశైల మల్లికార్జున సాగర జానపద సంచార కళాకారుల సంఘం గొంబే కుణిత, తాసి ప్రదర్శన, నందికోలు, సామల డొల్లు వంటి వివిధ సంగీత బృందాలు రథోత్సవంలో పాల్గొన్నాయి. శ్రావణమాసంలో భాగంగా మఠంలో నిర్వహించిన 56వ వార్షిక శివశరణ్ త్రికాల జ్ఞాని ఎమ్మిగనూరు, జడేసిద్దేశ్వర పురాణ ప్రవచనం గొప్ప విజయవంతమైంది. హెచ్‌ఎం విశ్వేశ్వరయ్యస్వామి, పురాణ ప్రవచనానికి ఎస్ వీరేష్ పురాణ పారాయణం, సీడీ మౌనేష్ అందించారు. మఠ ఉజ్జయిని సిద్ధలింగేశ్వర, ఎమ్మిగనూరు జడేసిద్దేశ్వర, నవగ్రహ, గణేశ, శ్రీమఠ్తీ స్థాపకుడు వేదవానమూర్తి, గోదావమూర్తి శ్రీమఠిలో ప్రతిష్ఠించిన పంచ పీఠాధీశ్వర శిలా విగ్రహాలకు ప్రత్యేక రుద్రాభిషేకం, గంగస్థల మహోత్సవం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు పంచ పీఠాధీశ్వరుల ఉత్సవమూర్తి అడ్డపల్లకి ఉత్సవం, ప్రణవోత్సవ, గోవోత్సవ, భస్మోత్సవ, గీతోత్సవ కార్యక్రమాలు విశేష వైభవంగా జరిగాయి. ఉభయ జిల్లాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

# అక్షరానికి అపూర్వ విజయం


మరిన్ని విన్నపాలు వినవలె..

కొత్తచెరువు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' చక్కటి ఫలితాలను ఇచ్చిందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం జరిగిన సక్సెస్ మీట్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. కొత్తచెరువులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించింది. సామాన్య ప్రజలు, రైతులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. తమ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. శ్మశాన వాటిక, ఇండోర్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జి, సీసీ రహదారులు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, ట్రాఫిక్ తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తెచ్చారు. ఆ సమస్యల్లో 99 శాతం పరిష్కరించామని ఎమ్మెల్యే అన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని రూ.2 కోట్లతో పూర్తి చేస్తామని తెలిపారు. పెనుకొండ రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న రూ.2 కోట్లు మంజూరు చేశారని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తచెరువు శ్మశాన వాటికకు 3.70 ఎకరాల స్థలాన్ని కేటాయించామని అన్నారు. పట్టణవాసులకు 1,150 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించామని తెలిపారు. 182 మందికి ఇంటి స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. కొత్తచెరువులో 120 ఆక్రమణలు తొలగించి, అభివృద్ధికి బాటలు వేస్తున్నామని అన్నారు.

**పరిశ్రమలకు భూములిస్తాం..**

నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే ఏపీఐఐసీ ద్వారా భూములు కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బండ్లపల్లి, కదిరేపల్లి సమీపంలో ఇండస్ట్రియల్ హబ్ కోసం 1,376.22 ఎకరాల భూమిని సేకరించామని అన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణం కోసం ఏపీ ఎస్పీడీసీఎల్‌కు 12 ఎకరాల భూమిని కేటాయించామని తెలిపారు.

**వేగంగా పరిష్కారం: పల్లె**

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వినూత్న కార్యక్రమంలో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమౌతున్నాయని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. కొత్తచెరువుకు త్వరలో వెలుగు.. వెలుతురు వస్తుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గానికి గ్రేట్ వేలాగా కొత్తచెరువును అభివృద్ధి చేస్తామని అన్నారు. మౌళిక సదుపాలైన తాగునీరు, విద్యుత్, పక్కా గృహాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఆక్రమణలు లేని రహదారుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. జిల్లాకు కొత్తచెరువు కేంద్ర బిందువు అని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'గేట్ వే ఆఫ్ పుట్టపర్తి'గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. సీఎం చంద్రబాబు అభివృద్ధికి చిహ్నమని, ఆయన కృషితోనే ఖజానా ఖాళీగా ఉన్నా సూపర్ సిక్స్ హామీలు అమలవుతున్నాయని అన్నారు. ప్రతి మహిళకు త్వరలో రూ.1500 నిరుద్యోగ భృతి అందుతుందని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు కొత్తచెరువులో పేదలకు వెయ్యికి పైగా ఇంటి పట్టాలు ఇచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నటరాజ్, ఇన్‌చార్జి తహసీల్దారు బాలాంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్ నాయక్, పీఆర్ జేఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల, టౌన్ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, బండ్లపల్లి రాజు, ముద్ద రవీంద్ర, నల్లమాడ శంకర, పీఎస్ వెంగప్ప, షర్ఫుద్దీన్, శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.


'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సక్సెస్ మీట్‌లోనూ సమస్యలపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి అర్జీలు ఇస్తున్న కొత్తచెరువు ప్రజలు

### విద్యార్థులు, క్రీడాకారుల కల నెరవేరనుంది

కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 2017లో టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులను ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇండోర్ స్టేడియం నిధులు ఇతర పనులకు మళ్లించారు. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్యను ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూలై 10న జరిగిన మెగా పీటీఎంలో ఇండోర్ నిర్మాణం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడారు. పనుల పునఃప్రారంభానికి రూ.2 కోట్లు ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇది ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కారణంగానే సాధ్యమైంది. సంస్థ యాజమాన్యానికి, ఎమ్మెల్యే, మాజీ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు.



- ఎ.వెంగన్న, విశ్రాంత హెచ్‌ఎం, కొత్తచెరువు

### ● ఏళ్ల సమస్య.. నెలల్లో పరిష్కారం



కొత్తచెరువు-పెనుకొండ రహదారిలో పదేళ్ల క్రితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించడంతో దాదాపు 200 మంది రైతుల పొలాలకు దారి లేకుండా పోయింది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లాం. వారు బ్రిడ్జిని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పి.. తర్వాత విస్మరించారు. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో సమస్యను ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వారు తక్షణమే కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్నకు విన్నవించారు. దీంతో ఆయన రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారు. వాటితో రైల్వే ట్రాక్ పక్కనే రోడ్డు పనులు చేపడుతున్నారు. నెలాఖరుకు పూర్తయితే పొలాలకు రోడ్డు సమస్య తీరుతుంది. ఏళ్లగా ఉన్న సమస్య.. నెలల్లో పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది.

-నాగేంద్రప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

### ● వెంటనే చర్యలు



'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో కొత్తచెరువులోని వేణుగోపాల్‌నగర్ వాసులు సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటుచేయాలని విన్నవించారు. వెంటనే రూ.30లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం.

-కుళ్లాయప్ప, వేణుగోపాల్‌నగర్

### తొలగనున్న చీకట్లు



మండల కేంద్రంలోని ఎల్1, ఎల్2, ఎల్ 3 కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలను ట్యూషన్ నుంచి పిలుచుకు రావడానికి రాత్రి సమయాల్లో బ్యాటరీలు తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రికి విన్నవించా. వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాలు సరఫరా చేశారు. వాటిని వెంటనే ఏర్పాటుచేసి, లైన్లు లాగితే అంధకారం తొలగిపోనుంది.

-షాహీదా, బీసీకాలనీ, కొత్తచెరువు

### రోడ్డు సమస్య పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో వంగంపల్లి బ్రిడ్జి వద్ద నుంచి గ్రామంలోకి సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి తెచ్చా. ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు 300 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలతో అంచనాలు వేసి, ప్రతిపాదనలు పంపారు. సమస్య పరిష్కారమవుతుండడం ఆనందంగా ఉంది.

-జయరాం, మాజీ ఎంపీటీసీ, ఇరగంపల్లి

### దాహం తీర్చారు నాయనా..: నాగలక్ష్మి, విజయనగర్ కాలనీ



కొత్తచెరువు విజయనగర్ కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవాళ్లం. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లా. స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు రూ.60వేలవ్యయంతో తాగునీటి ట్యాంకును ఏర్పాటుచేశారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య తీరింది నాయనా.. ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి ప్రత్యేక నమస్కారాలు.

### ఓల్టేజీ సమస్య తీర్చాలి



జిల్లా కేంద్రం పుట్టపర్తికి కొత్తచెరువు కూతవేటు దూరంలో ఉంది. దీంతో పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి, స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో లో ఓల్టేజీ సమస్య తలెత్తింది. దీంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోతున్నాయి. సమస్యపై విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

-అనిల్‌కుమార్, బీసీ కాలనీ, కొత్తచెరువు

### ● హైటెన్షన్ విద్యుత్‌లైన్ మార్పునకు చర్యలు



కొత్తచెరువు బీసీ కాలనీలోని ఇళ్లు, బీసీ బాలికల వసతిగృహంపై 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తోంది. దీంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో సమస్యను విన్నవించా. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. లైన్ మార్చడానికి రూ.8లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలు సిద్ధం చేశారు. అంత డబ్బు ప్రజలు చెల్లించలేరు. ప్రభుత్వ పరంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి చర్యలు చేపట్టాలి.

-ఒలిపి శీనా, కొత్తచెరువు

### నిధులు తెచ్చారు.. పనులను ప్రారంభించాలి..



మండల కేంద్రంలోని మస్తాన్‌వలీ దర్గా వీధిలో డ్రైనేజీ కాలువ లేక చుట్టుపక్కల ఇళ్ల వారు మురుగు నీటిని రోడ్డుపై వదులుతున్నారు. ఈ నీటిలో మసీదు, చర్చికి వెళ్లాల్సి ఉంది. సమస్యను 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో విన్నవించా. ఆ మేరకు ఎమ్మెల్యే దర్గావీధిని సందర్శించి, రూ.10లక్షల నిధులు మంజూరు చేయించారు. పైపులు కూడా తోలారు. వెంటనే మొదలెట్టాలి. అవసరమైతే జమాతి కింద రూ.4లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

- మాణిక్యంబాబా, మాజీ సర్పంచ్, కొత్తచెరువు

---

## డీఎస్సీ నకిలీలపై
# కలెక్టర్ సీరియస్

- ఫిర్యాదులపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశాలు
- సంబంధిత శాఖల అధికారులతో విద్యాశాఖ ఆరా


ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో ఆరాతీస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలకు సంబంధించి కొందరు అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే అంశంపై కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్‌గా పరిగణించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డీఎస్సీలో నకిలీల కలకలం..!' కథనంపై ఆయన స్పందించారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందేందుకు కొందరు అభ్యర్థులు బోగస్ సర్టిఫికెట్లు సమర్పించారని ఫిర్యాదులు వచ్చాయి. జాబితాలో లేని అభ్యర్థులు కొందరు బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. ప్రధానంగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) కింద నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులతో సర్టిఫికెట్లు జారీ చేయించుకొని ఉద్యోగాలు పొందుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. కొందరు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కింద ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ.. అదే కాలంలోనే బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారని, ఇది చట్ట విరుద్ధమని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇలా ఈడబ్ల్యూఎస్ కింద ఆరుగురు, ఉద్యోగాలు చేస్తూ ముగ్గురు బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు పెట్టారని ఫిర్యాదులు అందాయి. విద్యాశాఖతో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి ఫిర్యాదులు వెళ్లాయి. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాలపై కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. డీఈఓ ప్రసాద్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ.. 'ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం ఏంటీ.. ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి.. వెరిఫికేషన్‌లో చూడలేదా.. ఇంతకీ ఏమి జరుగుతోంది' అని సీరియస్‌గానే ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందుకు డీఈఓ స్పందిస్తూ.. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తహసీల్దార్లు జారీ చేశారని, వాటిని వాళ్లే చూడాలని చెప్పారు. ఫిర్యాదుల ఆధారంగా వాటన్నింటినీ రీ వెరిఫికేషన్ చేయించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఏడీ మునీర్, డీఎస్సీ సెక్షన్ సూపరింటెండెంట్ ఆదినారాయణ ఇతర సిబ్బంది ఫిర్యాదులు వచ్చిన అభ్యర్థులపై రీవెరిఫికేషన్‌కు చర్యలు చేపట్టారు. మంగళవారం జిల్లా కార్యాలయం నుంచి ఆయా అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లపై ఆయా శాఖల అధికారులతో వివరాలు ఆరా తీశారు. వాటిపై మళ్లీ విచారించి తగిన సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేజీబీవీలలో ఉద్యోగం చేస్తూ ముగ్గురు మహిళా అభ్యర్థులు బీఈడీ చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారని ఫిర్యాదులు రావడంతో ఎస్ఎస్ఏ, కేజీబీవీల ఎస్‌ఓలతో వివరాలు ఆరాతీశారు.

---

## పౌరుషానికి ప్రతీక హరికృష్ణ

- సంచలనాలకు మారుపేరు పవన్ కల్యాణ్ ● ఎమ్మెల్యే దగ్గుపాటి
- కేక్ కట్ చేసి సంబరాలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు, నిజ జీవితంలో పౌరుషానికి మారుపేరుగా బతికిన నాయకుడు నందమూరి హరికృష్ణ అని, సినిమాలు, రాజకీయాల్లో సంచలనాలకు మారుపేరుగా పవన్ కల్యాణ్ నిలిచారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాజీ మంత్రి, నందమూరి హరికృష్ణ జయంతి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ పరిశీలకుడు కోవెలమూడి నాని, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడుతో కలసి హరికృష్ణకు ఘనంగా నివాళి అర్పించారు. తర్వాత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ... నందమూరి హరికృష్ణ ఎన్టీఆర్‌కు చైతన్య రథసారథిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, సినీ నటుడిగా, నిర్మాతగా రాణించారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినిమాల్లోకి వచ్చి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, సంగా తేజస్విని, ఈటె స్వామిదాస్, చేపల హరి, దళవాయి వెంకట నారాయణ, నెట్టెం బాలకృష్ణ, ఓంకార్‌రెడ్డి, మల్లికార్జున, ముస్తాక్, నాగభూషణ, నాగరాజు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేని, నాయకులు

## ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గర్భిణీలు, బాలింతలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక చెన్నకేశవస్వామి గుడి వద్ద డొక్కా సీతమ్మ పేరిట అన్న వితరణ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. తమకు అన్ని విధాలుగా స్ఫూర్తి ప్రదాత పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన మార్గంలో ప్రతి కార్యకర్త నడుచుకొని పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నాయకులు బాబురావు, దివాకర్, కాయగూరల లక్ష్మీపతి, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, ధనంజయ్, సిద్దు, జయమ్మ, విజయ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ తదితరులు

## నేడు సాహితీ సదస్సు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర భారతి తెలుగుశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాఖ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీనియర్ సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా తాను రచించిన సిగ్నేచర్ ట్యూన్, విద్వాన్ విశ్వం, సాహితీ స్పర్శ, పప్పూరు రామాచార్యులు, సాహితీ వీక్షణం, సైన్స్-సమాజం-సాహిత్యం, అత్యున్నత కళారూపం సైన్సు, జనమాధ్యమాల్లో తెలుగు, మరపురాని మహనీయులు పుస్తకాలపై ప్రముఖ సాహితీవేత్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు విరివిగా హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

### జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ


ట్రోఫీతో రోషిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు ప్రతిభ చాటాడు. ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన 4వ జాతీయ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో ఆంధ్రా పారా త్రోబాల్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారుడు రోషిరెడ్డి సత్తా చాటాడు. జార్ఖండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రెండు సెట్లతో జట్టును గెలిపించిన రోషిరెడ్డి ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. పారా స్పోర్ట్స్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రామస్వామి రోషిరెడ్డికి అభినందనలు తెలిపారు.

---

# బైబై గణేశా..!

- ఘనంగా వినాయక నిమజ్జనం
- అర్ధరాత్రి వరకు కొనసాగిన శోభాయాత్ర
- కదిరిలో వెల్లివిరిసిన మతసామరస్యం

కదిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి శోభాయాత్రను కదిరి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏడు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడు నిమజ్జనానికి తరలి వెళ్లాడు. భక్తులు బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు. వర్షం కురుస్తున్నా యువతీ, యువకుల నృత్యాలు, మహిళల పూజలు, భక్తులు కోలాటాలతో పట్టణమంతా శోభాయమానంగా కనిపించింది. వీధులన్నీ ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. పట్టణంలోని వినాయక విగ్రహాలను మధ్యాహ్నం నుంచి రైల్వేస్టేషన్ వద్దకు తరలించారు. ముందుగా లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి వినాయక విగ్రహాల్ని స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. మరోసారి అర్చకులు తొలి పూజలు చేసి వినాయక నిమజ్జన యాత్రను ప్రారంభించారు. పట్టణంలోని పెద్ద విగ్రహాలైన బాలికల పాఠశాల వద్ద ఎర్రకోట వినాయకుడు, గొల్లమ్మ మండపం వద్ద ఉన్న సింహకోట వినాయకుడు, శివాలయం వద్ద ఉన్న వినాయకుడు, రైల్వే స్టేషన్ వద్ద రైల్వే గణేశ్‌ను నిమజ్జనానికి తరలించారు. వాటి వెంట వేలాది మంది భక్తులు పాటలు, డీజే డాన్సులతో పట్టణం హోరెత్తిపోయింది. విగ్రహాలన్నీ రైల్వే స్టేషన్ నుంచి పూలే సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా నరసింహస్వామిని దర్శించుకొని శివాలయం మీదుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న చెరువులో నిమజ్జనానికి వెళ్లాయి. ఈ సందర్భంగా కదిరిలో మతసామరస్యం వెల్లివిరిసింది. ముస్లింలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి స్వామి పూజల్లో పాల్గొన్నారు. వినాయకుడి విగ్రహం ఉన్న వాహనాన్ని లాగారు. పలుచోట్ల అన్నదానం, నీళ్ల బాటిళ్లు అందించారు. దాదాపు అర్ధరాత్రి వరకు శోభాయాత్ర కొనసాగుతూనే ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వి. రత్న బందోబస్తును పర్యవేక్షించారు. బందోబస్తులో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


వినాయక విగ్రహ వాహనాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కందికుంట తదితరులు


నిమజ్జనానికి తరలివెళుతున్న సింహకోట వినాయకుడు


నిమజ్జన చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ


నిమజ్జనానికి వెళుతున్న శివాలయం వినాయకుడు

# నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### పండిట్ కిషన్ మహరాజ్ (జయంతి)



జాతీయస్థాయిలో పేరొందిన తబలా వాద్యకారుడు పండిట్ కిషన్ మహరాజ్ 1923 సెప్టెంబరు 3న బెనారస్ (వారణాసి) ప్రాంతంలో జన్మించారు. హిందూస్తానీ సంగీతంలో ఒకటైన 'బెనారస్ ఘరానా'లో రాణించారు. డోలు, మృదంగం, పక్వాజ్ తదితర వాయిద్యాల ఆలాపనలోనూ రాణించారు. సితార్, సరోద్, ధృపద్, ధమార్ తదితర కళాకారులతో కలసి కచేరీలు ప్రదర్శించారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్ గ్రహీత. ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు. 2008 మే 4న కన్నుమూశారు.

### మాయవరం సరస్వతీ అమ్మాళ్ (జయంతి)



వేణుగాన విద్వాంసురాలు మాయవరం సరస్వతీ అమ్మాళ్ 1921 సెప్టెంబరు 3న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి పట్టణంలో జన్మించారు. చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీతంపై ఆసక్తి పెంచుకుని రాణించారు. ప్రత్యేకించి వేణుగానంలో పేరొందారు. పద్మ సుబ్రమణ్యం, వైజయంతి బాలి వంటి ప్రముఖులతో కలసి ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. భక్తిపాటలతో భజనలు, కావడిచిందు వంటి వాటికి సంగీతం అందించారు. జీవితసాఫల్య పురస్కారం, సంగీత నాటక అకాడమీ ఠాగూర్ పురస్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 2013 ఆగస్టు 17న కన్నుమూశారు.

### ప్యారేలాల్ (పుట్టినరోజు)



ప్రముఖ సంగీత దర్శకులలో ఒకరైన ప్యారేలాల్ రామ్‌ప్రసాద్ శర్మ 1940 సెప్టెంబరు 3న జన్మించారు. సంగీతంలో తండ్రి పండిట్ రామ్‌ప్రసాద్ శర్మ (బాబాజీ) వద్ద ఓనమాలు దిద్దారు. 'లక్ష్మీకాంత్-ప్యారేలాల్' విజయవంతంగా సాగిన భారతీయ సంగీత దర్శకుల ద్వయం. హిందీ చిత్రరంగానికి వీరిని రమేష్ నాయుడు పరిచయం చేశారు. 1963-98వరకు సుమారు 750 సినిమాలకు సంగీతం అందించారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. లక్ష్మీకాంత్ మృతి తర్వాత కూడా ప్యారేలాల్ తన తదుపరి స్వరకల్పనలకు 'లక్ష్మీకాంత్-ప్యారేలాల్' గానే కొనసాగించారు. సంగీతంలో సృజనాత్మకతకు సచిన్‌దేవ్ బర్మన్ ఇంటర్నేషనల్ అవార్డ్ అందుకున్నారు.

### సద్గురు జగ్గీ వాసుదేవ్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత జగ్గీ వాసుదేవ్ 1957 సెప్టెంబరు 3న మైసూరు ప్రాంతంలో జన్మించారు. యోగిగా, రచయితగా, 'సద్గురు'గా పేరొందారు. కోయంబత్తూరులో ఇషా ఫౌండేషన్ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి యోగాను నేర్పిస్తున్నారు. విద్య, పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తున్నారు. గ్రీన్ హ్యాండ్స్, ర్యాలీ ఫర్ రివర్స్, కావేరీ కాలింగ్ వంటి నినాదాలతో దేశ వ్యాప్తంగా ప్రజలలో చైతన్యం తెచ్చారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి పాటుపడుతున్నారు.

### సాక్షి మాలిక్ (పుట్టినరోజు)



ఫ్రీస్టైల్ రెజ్లర్ (మల్లయోధురాలు) సాక్షి మాలిక్ 1992 సెప్టెంబరు 3న హరియాణ రాష్ట్రం రోహతక్ ప్రాంతంలో జన్మించారు. 2014లో సమ్మర్ కామన్వెల్త్ గేమ్స్‌లో కుస్తీలో రజత పతకం, 2015లో కాంస్యపతకం, 2016 వేసవి ఒలింపిక్స్‌లో 58 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన తొలి మహిళ. 2022 బర్మింగ్‌హ్యామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారుపతకం సాధించారు. పద్మశ్రీ, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలు అందుకున్నారు.

### డొమినిక్ థీమ్ (పుట్టినరోజు)



ఆస్ట్రియన్ ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారుడు డొమినిక్ థీమ్ 1993 సెప్టెంబరు 3న జన్మించారు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్‌చే సింగిల్స్‌లో వరల్డ్ నెంబరు 3గా గుర్తింపు పొందారు. 2018, 2019 ఫ్రెంచ్ ఓపెన్, 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ పోటీల్లో ఫైనల్స్‌దాకా చేరారు. గ్రాండ్‌స్లామ్‌తో కలిపి 17 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్ సాధించారు. పర్యావరణం కోసం మద్దతు ఇస్తూ ప్రజలను చైతన్యం కల్పిస్తున్నారు.

## అటల్ ల్యాబ్స్‌తో పరిశోధనలకు దోహదం

**- జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు**

అనంతపురం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అటల్ ల్యాబ్స్ ఉన్నత పాఠశాలల విద్యార్థుల పరిశోధనలకు ఎంతగానో దోహదపడతాయని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం వీసీ సుదర్శన్‌రావు అన్నారు. మంగళవారం ఈఈఈ విభాగం సెమినార్ హాల్‌లో విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యాశాఖ, బీసీడీఈ, యూనిసెఫ్, విగ్యాన్ ఆశ్రం సంయుక్తంగా అటల్ మెంటర్షిప్ వర్క్‌షాపు నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ సుదర్శన్‌రావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో అటల్ ల్యాబ్స్ స్థాపించిందన్నారు. వీటిపైన అవగాహన కల్పించడానికి ఉన్నత విద్యాశాఖ, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ల్యాబ్స్‌పై శిక్షణ ఇస్తోందన్నారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ..మూడురోజుల శిక్షణకు విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాల విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యులు శ్రీనివాసులు, దేవకుమార్, సుదర్శన్, శైలజ, బాలమురళీకృష్ణ, వసుంధర పాల్గొన్నారు.

## టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

# రాష్ట్రవ్యాప్తంగా బసవసంస్కృతి అభియాన



ప్రసంగిస్తున్న డాక్టర్ బసవలింగ పట్టదేవరు, మంత్రి శివానంద పాటిల్ తదితర స్వామిజీలు

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం బసవణ్ణను కర్ణాటక సాంస్కృతిక నాయకగా ప్రకటించిన నేపథ్యంలో విజయపుర జిల్లా బసవనబాగేవాడిలో బసవసంస్కృతి అభియానకు సోమవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 1వరకు అభియాన కొనసాగనుంది. బసవణ్ణ జన్మించిన స్మారకం వద్ద ప్రారంభమైన రథయాత్రలో 1100మందికిపైగా మహిళలు బసవణ్ణ వచనగ్రంథాలను తలపై మోస్తూ సాగారు. వందలాది మంది శరణరు బసవధ్వజం చేతబట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భాల్కికి చెందిన డాక్టర్ బసవలింగ పట్టదేవరు మాట్లాడుతూ ప్రభుత్వం బసవణ్ణను రాష్ట్ర సాంస్కృతిక నాయకుడిగా ప్రకటించిందని, ప్రభుత్వమే బసవనబాగేవాడిలో ప్రతి సంవత్సరం బసవజయంతి నిర్వహించాలన్నారు. సాణెహళ్ళి పండితారాధ్య స్వామిజీ మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ దేశానికి రాజ్యాంగాన్ని రచించారని, 12వ శతాబ్దంలోనే ప్రపంచానికి చాటేలా రచనలు చేశారన్నారు. ర్యాలీలో మంత్రి శివానందపాటిల్, ఇంగళేశ్వర చన్నబసవస్వామిజీ, నిష్కల్మషమఠం నిజగుణానందస్వామిజీ, విరక్తమఠం సిద్ధలింగస్వామిజీ, హులసూరు శివానంద స్వామిజీ, అథణి మోటగిమఠం ప్రభు చన్నబసవ స్వామిజీ సిద్ధలింగస్వామిజీ, బసవేశ్వర సేవాసమితి అధ్యక్షుడు ఈరణ్ణపట్టణశెట్టి, బసవనబాగేవాడి పురసభ అధ్యక్షురాలు జగదేవి గుండళ్ళి పాల్గొన్నారు.



ఊరేగింపులో కళాకారుల సందడి

# సామాజిక చైతన్యంలో నాటకాల ప్రభావం అపారం

**● ప్రముఖ కవి, ప్రొఫెసర్ ఎస్‌జీ సిద్ధరామయ్య**



పౌరాణిక గీతగాయనం శిబిరంలో ప్రొఫెసర్ ఎస్‌జీ సిద్ధరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యం కలిగించడంలో నాటకాల ప్రభావం అపారమని ప్రముఖ కవి, ప్రొఫెసర్ ఎస్‌జీ సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. కన్నడసంఘం, కర్ణాటక అకాడమీ, పదసంస్థ సహకారంతో నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం పౌరాణిక గీతగాయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో నేటికీ పండుగలు, పౌర్ణమికి ఏడాదికోసారి పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. గ్రామీణులు తమ తీరికవేళల్లో పౌరాణిక నాటకాలను నేర్చుకుని అభినయిస్తారన్నారు. ఇందులో కులమత బేధభావాలు ఉండవన్నారు. అన్ని వర్గాలవారు నాటకాలను నేర్చుకుంటున్నారన్నారు. సమాజంలో చోటు చేసుకుంటున్న అహింస, ఇతరత్రా ఘటనలను నియంత్రించేందుకు, మానవత్వం పెంచేందుకు నాటకాల ప్రదర్శనలతో చైతన్యం కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ నాగేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. కళాకారులే నిజమైన సాంస్కృతిక రాయబారులన్నారు. నాటకరంగం నుంచి వచ్చిన కన్నడ కంఠీరవగా పేరొందిన డాక్టర్ రాజ్‌కుమార్ దేశంలోనే గుర్తింపు పొందారన్నారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కూడా అందుకు తగిన రీతిలోనే కళాకారులుగా రాణిస్తున్నారని కొనియాడారు. కర్ణాటక నాటక అకాడమీ సభ్యుడు రవీంద్రనాథ్ సిరివర, కన్నడసంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి పాల్గొన్నారు.

## గ్రామసభల్లో ఫిర్యాదుల స్వీకరణ



సమావేశంలో నోడల్ ఆఫీసర్ రవి తదితరులు

బంగారపేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె గ్రామపంచాయతీ పరిధిలోని బలమండె గ్రామంలో మంగళవారం జమాబంది సమావేశం నిర్వహించారు. ఇటువంటి సమావేశాలకు గ్రామపంచాయతీ సభ్యులు, సిబ్బంది మాత్రమే కాకుండా ప్రజలు కూడా పాల్గొనాలని బలమండె పంచాయతీ నోడల్ అధికారి, పీడబ్ల్యూడీ ఏఈఈ రవి సూచించారు. పీడీఓ మధుచంద్రను మందలించారు. పంచాయతీ ఆదాయం, ఖర్చులకు సంబంధించి ప్రజల కు కూడా తెలవాల్సి ఉందని, వారు కూడా పాల్గొనేలా సమాచారం ఇవ్వాల న్నారు. పంచాయతీ నుంచి దాదాపు ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా అవుతోం దని, అయితే నీటిపన్ను మాత్రం ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నిం చారు. ఇంతవరకు కేవలం 11శాతం మాత్రమే నీటి పన్ను వసూలు కావడంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ట్యాక్స్ కలెక్టర్ త్యాగరాజును ప్రశ్నించారు. పంచాయతీకి సంబంధించిన కొనుగోళ్లకు అధ్యక్షుడి నుంచి ఆమోదం పొంది కొటేషన్ తీసుకున్నాకనే కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ ఎందుకు పాటించడం లేదని మండిపడ్డారు. నరేగా పనులకు సంబంధించిన బిల్లులను ఎందుకు అప్‌డేట్ చేయలేదని ప్రశ్నించారు. పంచాయతీకి ఇంకా 89శాతం రెవెన్యూ రావాల్సి ఉన్నప్పటికీ ఎందుకు వసూళ్లు చేయడం లేదని ప్రశ్నించారు. ఇకపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కార్యదర్శి రవికుమార్, అధ్యక్షులు సరస్వతి రామశెట్టి, ఉపాధ్యక్షులు చంద్రకళ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మంత్రాలయకు మఠాధిపతి శ్రీకారం

**» నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భాగస్వామ్యం**

మహదేవపుర, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మంత్రాలయ అభియానకు మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామిజీ మంగళవారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు మంత్రాలయం చేరుకున్నారు. మాజీ మంత్రి అరవింద లింబావళి నేతృత్వంలో స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామీజీ మాట్లాడుతూ స్వచ్ఛతతోనే ఆరోగ్యం, ప్రగతికి, సంస్కృతికి ప్రతీక సాధ్యమని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ సుందర మంత్రాలయ అభియానలో కరసేవకులుగా ఎంతోమంది పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇల్లు, గ్రామం, చెరువులు స్వచ్ఛంగా ఉంచుకోవడం ద్వారా ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. కాగా మాజీమంత్రి లింబావళి ఎన్నో ఏళ్లుగా మఠం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో తరచుగా పాల్గొంటున్నారన్నారు. 2009లో వరదల సమయంలోనూ మఠం బాగోగులు పర్యవేక్షించారన్నారు. గురురాఘవేంద్ర మఠానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారన్నారు. ప్రధాని పిలుపుతో మంత్రాలయంలో స్వచ్ఛతా అభియానను లింబావళి నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. మఠం చుట్టుపక్కల 22 ప్రాంతాల్లో స్వచ్ఛతా పనులు కొనసాగుతాయన్నారు. గోశాల, తుంగభద్ర నదీతీరం, కోనేరు, పబ్లిక్ గార్డెన్, పాకశాల, ప్రముఖ వీధు లు, ప్రసాద పంపిణీ కేంద్రాలు తదితర ప్రాంతాలలో స్వచ్ఛతా పనులు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారి సుబ్బణ్ణ, మహదేవపుర హోబళి అర్బన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు పిళ్ళప్ప, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు రాజేశ్, మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత పనులు ప్రారంభిస్తున్న సుబుదేంద్రతీర్థ స్వామీజీ, మాజీ మంత్రి లింబావళి తదితరులు

## నకిలీ విత్తనాలతో నష్టం... ఆదుకోండి

ముళబాగిలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల వల్ల కీరదోస పంట నష్టపోయినట్టు పలువురు రైతులు వాపోయారు. రైతు చిక్కమునివెంకటప్పకు 3లక్షల రూపాయల పరిహారం అందించి ఆదుకోవాలని మరో రైతు అంబరీశ్ డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు అప్పు చేసి పంటలు సాగు చేశామని అయితే నకిలీ విత్తనాల వల్ల నష్టపోయామని వాపోయారు. దిగుబడి బాగున్నా నకిలీ విత్తనాలతో నాసిరకంగా ఉండడంతో సరైన ధర లభించక నష్టం వాటిల్లినట్టు తెలిపారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ మాట్లాడుతూ కోలారు జిల్లాలో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. కొన్ని దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ధైర్యం చాలడం లేదని, రాజకీయ నాయకుల ఒత్తిడితో పట్టించుకోవడం లేదన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, అదే రీతిన నకిలీ విత్తనాల కంపెనీలు, దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు ఈకంబళ్ళి మంజునాథ, పుత్తేరి రాజు, గిరీశ్, ముని వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



కాయలను చూపుతున్న రైతుసంఘం సభ్యులు తదితరులు

## డెయిరీ సంఘం అధ్యక్షుడిగా సురేశ్

శిడ్లఘట్ట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తుమ్మనహళ్ళి గ్రామపంచాయతీ సొరకాయలహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం అధ్యక్షుడిగా ఎం సురేశ్, ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 11మంది సభ్యులు బలం కల్గిన సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తలా ఒక్కొక్కటే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మంజునాథ్ ప్రకటించారు. ఫలితాల అనంతరం సంఘం నూతన అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతోనే ఏకగ్రీవం సాధ్యమైందన్నారు. పాలసంఘం డైరెక్టర్ ఎస్‌ఎం రవిచంద్ర, గ్రామపంచాయతీ సభ్యుడు దొడ్డదాసరహళ్ళి నంజప్ప, సొరకాయలహళ్ళి గ్రామపంచాయతీ సభ్యులు మద్దూరమ్మ మునిరాజు, దొడ్డదాసహళ్ళి లక్ష్మీదేవమ్మ, దేవరాజ్, మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో సభ్యులు

# బొప్పాయికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం: కలెక్టర్

కూడేరు, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బొప్పాయి సాగును మరింత ప్రోత్సహించే దిశగా ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కమ్మూరు గ్రామ రైతు ఓబయ్యకు చెందిన బొప్పాయి తోటను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో బొప్పాయి దిగుబడిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదనీ, దీంతో నష్టపోతున్నామని రైతు ఓబయ్య చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బొప్పాయికి మార్కెట్ సౌకర్యం కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, మంచి ధరలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ధనుంజయ, తహసీల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.



బొప్పాయి నాణ్యతను చూపుతున్న రైతు ఓబయ్య

## ఒకటో తరగతికి రూ.7.35 లక్షల ఫీజు

**» పాఠశాల రసీదు సోషల్ మీడియాలో వైరల్**

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం ఐటీబీటీ నగరంగా పేరొందిన విషయం విదితమే. ఇక్కడ సామాన్య, మధ్య తరగతి వర్గాలతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా అధికమే. నగరంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరేందుకు ఏడాదికి ఫీజు రూ.7.35 లక్షలుగా ఉంది. ఈ విషయాన్ని ఒకరు ఇంటర్నేషనల్ స్కూల్ రసీదును సోషల్ మీడియాలో ఆగస్టు 31న పోస్ట్ చేయగా వైరల్ అయ్యింది. ప్రైమరీ తరగతులు 1 నుంచి 5 వరకు రూ.7.35 లక్షలుగాను, 6 నుంచి 8వ తరగతి వరకు రూ.7.75 లక్షలుగా, 9, 10 తరగతులకు ఏడాదికి రూ.8.50లక్షలుగా ఫీజు నిర్ణయించారు. ఇక 11, 12వ తరగతులకైతే వార్షిక ఫీజు రూ.11లక్షలుగా ఉంది. ఇదే సందర్భంగా ఆయన ఒక కామెంట్ చేశారు. ఒక ఐటీ దంపతులు ఇద్దరికీ ఏడాదికి రూ.50లక్షల ఆదాయం ఉందనుకుంటే ఒక పిల్లవాడికైతే ఫీజు భరించవచ్చునని, అదే ఇద్దరు ఉంటే భారమేనని పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌ను 1.71లక్షలమంది వీక్షించారు. భిన్నమైన కామెంట్‌లు చేశారు.

## శ్మశానంలో విశ్రాంతిధామ ప్రారంభం




విశ్రాంతిధామ ప్రారంభోత్సవంలో సవితాబాబురెడ్డి తదితరులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని హాలనాయకనహళ్ళి గ్రామంలోని శ్మశానంలో విశ్రాంతిధామను గ్రామపంచాయతీ అధ్యక్షుడు సవితా బాబురెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీ సర్వే నెంబరు 23లో 1.07 ఎకరాలలో, హాడోసిద్దాపుర గ్రామాలలో తలా 5లక్షల రూపాయలతో మొత్తం రూ.15 లక్షలతో శ్మశానంలో విశ్రాంతిధామను నిర్మించారు. గ్రామస్థుల డిమాండ్ మేరకు ఆదర్శ బిల్డర్ జైశంకర్ రోడ్డుపనులకు ఎక్కువ విరాళం ఇచ్చారు. ఇతర దాతలు కూడా సహకారం అందించారని గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు, సమాజసేవకుడు బాబురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సీ వెంకటేశ్, సభ్యులు మంజునాథ్, గీతా, శ్వేతా సురేశ్, శివకుమార్, శోభా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా పోటీల్లో రాణించిన విద్యార్థులు



ప్రశంసా పత్రాలతో విద్యార్థుల బృందం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఐదో జాతీయ యోగా చాంపియన్‌షిప్ పోటీలలో తాలూకాలోని జంగమకోటెక్రాస్ జ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థులు రాణించారు. యోగా టీచర్ కేఆర్ రఘుపతి మార్గ దర్శకంలో ఏ ప్లస్ గ్రౌండ్‌లో పలు రకాల పోటీలు సాగాయి. తొమ్మిదో తరగతి ఎస్ శానిత మూడోస్థానంలో, మరో విద్యార్థి నాల్గోస్థానం నిలిచారు. పాఠశాల కీర్తిని ఇనుమడింపచేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిం చారు. విద్యా సంస్థ కార్యదర్శి రాజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానుశ్రీ తదితరులు ప్రశంసించారు.

## జేసీ రోడ్డులో నత్తనడకన మరమ్మతులు



ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి సమీపంలో రోడ్డు పరిస్థితి

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని రద్దీ మార్గాలలో ఒకటైన జేసీ రోడ్డులో ఇటీవల వైట్‌ట్యాపింగ్ పనులతోపాటు డ్రైనేజీ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. వైట్‌ట్యాపింగ్ పనుల కారణంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. కాగా ఈ మార్గంలో రాజకాలువ కూడా ఉండడంతో డ్రైనేజీ మరమ్మతు పనులు నత్త నడకన సాగుతున్నాయి. పనులు వేగిరం చేసి ట్రాఫిక్‌కు అనుకూలం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### 'పీఎంశ్రీ స్కూళ్లను ఆదర్శంగా నిలపాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కూళ్లను ఆదర్శంగా నిలపాలని హెచ్‌ఎంలకు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సూచించారు. పీఎంశ్రీ స్కూళ్ల హెచ్‌ఎంలకు స్థానిక గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఏపీసీ మాట్లాడారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ ద్వారా వసతులు కల్పిస్తున్నారన్నారు. పిల్లలకు వాటిని అందించేందుకు ప్రతి హెచ్‌ఎం చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓలు, స్పోర్ట్స్ సెక్రటరీలు, ఆర్పీలు, ఏఎంఓ ఫణిరాజ్, జీసీడీఓ కవిత పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1625.59 | 1,630.73 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 79.324 | 40,107 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 68,707 | 13,475 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 78.44 | 96.84 |

# చిత్ర ప్రదర్శనకు తెర

● వారం రోజులుగా హొసపేటలో థియేటర్లు బంద్ ● ఎన్‌ఓసీల పేరుతో అధికారులు వేధిస్తున్నారని యజమానుల ఆవేదన

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రమైన హొసపేట నగరంలోని కొద్ది రోజులుగా సినిమా థియేటర్లు బంద్ కావడంతో ప్రేక్షకులకు నిరుత్సాహం ఎదురైంది. అందులో గత వారం రోజులుగా నగరంలో వినాయక ఉత్సవాలు జరుగుతుండగా మరోవైపు ఉత్సవాల అనంతరం సినిమా చూడాలనుకునే ప్రేక్షకులకు థియేటర్‌లు బంద్ కావడంతో నిరాశ తప్పడం లేదు. హొసపేట నగరంలో నాలుగు సినిమా థియేటర్‌లు నిర్వహణకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నుండి "నాన్ అబ్జెక్షన్" సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) పొందని కారణంగా అలాంటి థియేటర్‌లు ప్రదర్శనలు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో వారానికిపైగా థియేటర్లు మూతబడ్డాయి. సాధారణంగా సినిమా థియేటర్ నిర్వహణ చేయాలంటే ప్రజా పనుల శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీసు, నగరసభల నుండి ప్రతి మూడేళ్ళకొక మారు పరిశీలన అనంతరం నో అబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. అయితే నియమాలు పాటించని సినిమా థియేటర్లు సినిమా థియేటర్లకు వెళ్ళే ప్రజల జీవ, సురక్షత, ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందనే నేపథ్యంలో జిల్లా పాలనా మండలి సినిమా థియేటర్ల ప్రదర్శనలపై కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. నగరంలోని సినిమా థియేటర్ల కాకుండా జిల్లా పరిధిలోని ఇతర ప్రాంతాల్లో సినిమా థియేటర్లు కూడా ఎప్పటికప్పుడు ఎన్‌ఓసీ ప్రమాణ పత్రం పొందడం తప్పని సరి. నిబంధనలు పాటించని ఇతర తాలూకాలోని సినిమా థియేటర్లుకు కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. హొసపేట నగరంలోని సినిమా థియేటర్లకు 20 రోజుల క్రితమే నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయితే నోటీసులు అందుకున్న సినిమా థియేటర్ల యాజమాన్యం ఎలాంటి సమాధానం రాని కారణంగా సినిమా థియేటర్ బంద్‌కు ఆదేశించినట్లు జిల్లా పాలనా మండలి పేర్కొంటోంది. అయితే ఎన్‌ఓసీ పొందితే... ఒక గంటలో సినిమా థియేటర్ల తలుపులు తెరవడానికి అవకాశం ఇస్తామనే సమాధానం జిల్లాఅధికారి ఎంఎస్ దివాకర్ పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి మూడు సినిమా థియేటర్ల యజమానులు అర్జీలు వేశారు. నగరంలోని నాలుగు సినిమా థియేటర్ల పైకి మూడు సినిమాథియేటర్ల యజమానులు ఎన్ఓసి అర్జీలు వేశారు. అయితే స్థల పరిశీలన జరిపి కొన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు, నివేదికలను పై అధికారులకు అందజేసినట్లు ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవినాయక్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సినిమా థియేటర్లు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించారని, ఇప్పటికే కొన్ని శిథిలావస్థకు చేరినట్లు, అందులో ప్రేక్షకులకు అవసరమైన మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేవని అధికారులు గుర్తించి నివేదికలో పేర్కొన్నారు. కూర్చోవడానికి సరైన సీట్ల వ్యవస్థ కూడా సరిగా లేదని, వీటిని కూడాసరిచేయాలని సినిమ థియేటర్ల యాజమాన్యానికి తెలిపినట్లు పలు శాఖల అధికారులు తెలుపుతున్నారు. అయితే అసలే వసూళ్లు లేక నష్టాల్లో నడుపుతున్న తమపై నిబంధనలపేరుతో ఒత్తిడి చేయడం సరికాదని యజమానులు వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే థియేటర్లు మూసేయక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హొసపేట నగరంలో మూతబడిన ఓ థియేటర్



ఎలుగుబంటి కళేబరాన్ని తరలిస్తున్న అటవీ సిబ్బంది

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎలుగుబంటి మృతి

బళ్లారి సిటీ/గాంధీనగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా, కూడ్లిగి తాలూకా పరిధిలోని జాతీయ రహదారి -50లో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఎలుగుబంటి మృతి చెందింది. నాలుగైదు సంవత్సరాలు కలిగిన మగ ఎలుగుబంటి మంగళవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఎలుగుబంటికి శవ పరీక్షల అనంతరం అటవీశాఖ నియమాల ప్రకాకరం అవసరమైన చర్యలు తీసుకొన్నట్లు కూడ్లిగి విభాగం అటవీశాఖ అధికారి సందీప్‌నాయక్ తెలిపారు. వాహనదారులు వన్యప్రాణుల కదలికపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు.

## పాము కాటుతో రైతు మృతి

రాయచూరు సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా అమరాపుర గ్రామ పంచాయతీ పరిధిలోని నవిలగుడ్డలో పాముకాటుకు రైతు బలైయ్యారు. అమరాపుర గ్రామానికి చెందిన హొన్నప్ప(40) మంగళవారం సాయంత్రం తన పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురైయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను జాలహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సనందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హొన్నప్ప మృత్యువాతపడ్డాడు. సంఘటనకు సంబంధించి జాలహళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు.



హొన్నప్ప (ఫైల్)

## వార్డుల్లో అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గణేశ్ అన్నారు. మంగళవారం రూ. 4 కోట్లతో కొత్త బస్టాండు నుంచి మారుతి నగర్ వరకు ప్రారంభించనున్న రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేపట్టారు. ఇందిరా క్యాంటీన్ వద్ద పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ వార్డు అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. కంప్లి పట్టణ స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు అందరు ముందుకు రావాలన్నారు. ఎన్నికల్లో హామీలను నెరవేర్చడం ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించేలా చేయడమే లక్ష్యం అన్నారు. పాత బస్టాండ్, నీటి పారుదల శాఖ కాంపౌండ్ వాల్‌ను తొలగించి ఈ ప్రాంతానికి సుందరంగా చేస్తామన్నారు. రోడ్డును అభివృద్ధి చేయడమే లక్ష్యం ప్రజా పనుల శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి ఇప్పటికే కంప్లిలో కొత్త వంతెన నిర్మాణ ఏర్పాటుకు చర్చించామన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్, కౌన్సిలర్ చాంద్ బాష, విరుపాక్ష, మస్తాన్, సిద్దప్ప, నారాయణప్ప, కరిబసన్న గౌడ, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాముకు పాలు పోసి పూజలు

● బతికుండగానే అన్నీ.. అనంతరం అడవిలోకి..

రాయచూరు సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా విగ్రహాలుగా ఉన్న నాగదేవతలకు పుట్టల వద్ద పాములుపూసి పూజించడం ఆనవాయితీ. ఎక్కడైనా నిజమైన పాము కనిపిస్తే వెంటనే కొట్టి చంపే ప్రయత్నం చేయడం సహజం. ఏకంగా బతికున్న పాముకు పూజలు చేసి అందరినీ అశ్చర్యంలో ముంచారు. ఈ వింత సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటన మంగళవారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా జంగిరాంపూర్ తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన సునీల్ పవార్ తన ఇంటి వద్ద కనిపించిన నాగుపాముకు ప్రత్యేక్షంగా పూజలు నిర్వహించి కొబ్బరి కాయకొట్టి దండాలు పెట్టడం అందరిని ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. అనంతరం ఆయనే స్వయంగా పాములు పట్టే వారిని పిలిపించి పామును అడవికి తరలించారు.



నాగుపాముకు పాలు వేసి పూజలు చేస్తున్న సునీల్ పవార్



17వ వార్డులో పర్యటిస్తున్న సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

## సమస్యల పరిష్కారానికే సలాం బళ్లారి

● వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో 17వ వార్డుల్లో మంగళవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకునేందుకు 'సలాం బళ్లారి' కార్యక్రమం సందర్భంగా వార్డులో ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు భరత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ గ్యారెంటీలు ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీల ద్వారా మహిళలకు రూ. రెండు వేలు ఉచిత కరెంటు మహిళా శక్తి యువజన ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులో వుండటంతో సంతోషంగా వుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలు ఏమైనా వుంటే తమకు తెలియజేయాలని, వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కవిత వన్నప్ప, హగరి గోవిందు, రాజు, రఘు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నిరసన



కర్ణాటక గ్రామీణ బ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల ఉద్యోగుల కోసం ఫిర్యాదుల సెల్ ఏర్పాటు, పదోన్నతుల్లో వివక్షను తొలగించడం వంటి అనేక డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కర్ణాటక గ్రామీణ బ్యాంకు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ అభివృద్ధి సంఘం బ్యాంకు ముదు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం జరిగిన ఆందోళనలో అసోసియేషన్ అధ్యక్షుడు డీపీ బొమ్మయ్య మాట్లాడుతూ కర్ణాటక గ్రామీణ బ్యాంకుల్లో ఎస్సీఎస్టీ ఉద్యోగుల సమస్యలను వినడానికి ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బదిలీలు పదోన్నతుల్లో వివక్షతను తొలగించాలని, సీనియారిటీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బ్యాంకు వెంటనే వీటిని సరిదిద్దాలన్నారు. కర్ణాటక గ్రామీణ బ్యాంకు యాజమాన్యం ఎస్సీఎస్టీ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించడంలో నిరంతరం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## నిమజ్జనం సందర్భంగా పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హోస్పేట, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరగనున్న గణేష్ నిమజ్జనం, రానున్న మిలాదునబీ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంగళవారం పోలీస్ వాహనాల కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఈవీ క్యాంప్, పీఎల్‌సీ క్యాంప్, హెచ్‌ఈఎస్ రోడ్, నిషాని క్యాంప్, మురుగన్ టెంపుల్ రోడ్లలలో వాహనాల కవాతు నిర్వహించారు. ఈ సంర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లరకు పాల్పడితే చర్యలు తప్పవని సూచించారు.

## ఉత్సాహంగా క్రీడాపోటీలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాలికె అధ్యక్షురాలు నరసమ్మ

రాయచూరు సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో మంగళవారం మలియాబాద్ క్లస్టర్ స్థాయి హైస్కూల్ క్రీడాపోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పోటీలను ప్రారంభించిన రాయచూరు మహానగర పాలికె అధ్యక్షురాలు నరసమ్మ, దేహదారుఢ్యం మానసిక వికాసానికి క్రీడలు అత్యవసరమని అన్ని వర్గాల వారు క్రీడల్లో పాల్గొని తమ దేహదారుఢ్యన్ని మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# హోసూరు జోన్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

## సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

హోసూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మీతో స్టాలిన్ పేరిట వివిధ శాఖల సేవలు చేరువయ్యేలా శిబిరాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. బెలత్తూరు వీబీఆర్సీ భవనంలో మంగళవారం శిబిరం సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మహిళా హక్కుల నిధి, దివ్యాంగుల సంక్షేమశాఖ సహా 47 విభాగాలకు సంబంధించిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గజేంద్రమూర్తి, నగేశ్, శివశంకర్, యూనియన్ ఉపకార్యదర్శులు బాబు, రమేశ్, బెలత్తూరు రవి, మథియజగన్, సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ కోత

హోసూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బాగలూరు సబ్‌స్టేషన్, నారికనపురం సబ్‌స్టేషన్, సేవకనపల్లి సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ పరికరాల నిర్వహణ పనులు చేపట్టనున్నారు. 3న బుధవారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బాగలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని బాగలూరు, జీమంగళం, ఉలియాలం, నల్లూరు, పెలత్తూరు, తిన్నపల్లి, సూదాపురం, అలసపల్లి, ముత్తుకనపల్లి, దేవీరపల్లి, సత్యమంగళం, పలవనపల్లి తదితర గ్రామాలలోనూ, నారికనపురం, సేవకనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

## పాఠశాలను పరిశీలించిన మేయర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మేయర్ సత్య

హోసూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): హోసూరు మునిసిపాలిటీలోని ఆర్‌వీ ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాలను మేయర్ సత్య పరిశీలించారు. పాఠశాలలో నిర్మిస్తున్న గది భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్థితిలో ఉన్న పాత తరగతి గదుల కూల్చివేత, విద్యార్థులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యాయులు కోరగా సానుకూలంగా స్పందించారు. మధ్యాహ్న భోజన ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ చైర్మన్ రవి, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వలర్మతి, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామప్రజలు

## బస్సు కోసం విద్యార్థులు, గ్రామస్థుల ఆందోళన

రాయచూరు సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సులు నడపాలంటూ జిల్లాలోని లింగసుగూరు తాలూకా నీరలకేరి గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. వీరికి గ్రామస్థులు కూడా మద్దతు పలికారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బస్సులు సరిగ్గా నడపకపోవడంతో తాము అనివార్యంగా గైర్హాజరైయ్యే దుస్థితి తలెత్తిందన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులకు పలు సార్లు విన్న వించినా ఇప్పటికి స్పందించడం లేదని విద్యార్థులు ఆరోపించారు. కాగా గ్రామ సమీపంలో రోడ్డు పై బైఠాయించి ఆందోళనకు దిగడంతో గంటకుపైగా ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. లింగసుగూరు డిపో మేనేజర్ ధర్నా దగ్గరకు వచ్చి విద్యార్థులకు నచ్చజప్పడంతో వారు ఆందోళనను విరమించారు. బస్సుల సంఖ్య పెంచడంతో పాటు, పాఠశాలలు, కళాశాలల సమయానికనుకూలంగా బస్సులు నడుపుతామంటు హామి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

# పంటలకు వన్యప్రాణుల బెడద

● జన సంచారంలోకి జింకలు, నెమళ్లు, కుందేళ్లు ● పంటలు దెబ్బ తింటున్నాయని రైతుల ఆవేదన



పంటల్లో గుంపులుగా ఉన్న జింకలు



మొక్కజొన్నపైరును తినేసిన జింకలు

చిలమత్తూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడుకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ఒక పక్క చీడపీడలతో పాటు, వాతావరణ పరిస్థితులు భారంగా మారిన వేళ వన్యప్రాణులు మరో భారంగా మారుతున్నాయి. ఇటీవల జనసంచారంలోకి వన్యప్రాణులు వస్తున్నాయి. ఈ కారణంగా రైతులు సాగుచేసుకుంటున్న పొలాల్లో మకాం వేసి పంటలకు నష్టం కలుగజేస్తున్నాయి. మండలంలో జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పందులు విపరీతంగా పెరిగిపోయాయి. అవి పచ్చని పంటలపై పడుతూ రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా విత్తుకున్న పంటలపై విరుచుకుపడుతున్నాయి. గతంలో ఎర్రకొండ అటవీ ప్రాంత పరిసరాల్లో ఈ వన్యప్రాణుల బాధ ఉండేది. అయితే అవి ఇప్పుడు మండల వ్యాప్తంగా విస్తరించడంతో అన్ని గ్రామాల్లో వాటి సమస్య తీవ్రమైంది. చిలమత్తూరు, దేమకేతేపల్లి, యగ్నిశెట్టిపల్లి, కోడూరు, చాగలేరు, పలగలపల్లి, మొరసలపల్లి పంచాయతీల్లో వీటి బెడద తీవ్రంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. వేరుశనగ పంటలో జింకలు గుంపులు గుంపులుగా చొరబడి కాళ్లతో వేరుశనగ మొక్కలను కదిలించి వాటికి ఉన్న ఊడలను మేస్తున్నట్లు వాపోతున్నారు.

మిరపలో అయితే నెమళ్లు కాయాలను ఏరుకొని తినేస్తున్నాయంటున్నారు. నెమళ్ల సంఖ్య కూడా భారీగా పెరగడంతో వాటి నుంచి నష్టం భారీగానే ఉంటోంది. చేతుకొచ్చిన పంటలను ఇంటికి తీసుకెళ్లడం కష్టంగా ఉందని, వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందంటున్నారు. అధికారులు కలుగజేసుకొని వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### లే అవుట్ల క్రమబద్ధీకరణపై నేడు అవగాహన

మడకశిర టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ఉన్న అనధికార ప్లాట్లు, లే అవుట్లను వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం జీఓ 134 ప్రకారం సవరణ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

### నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి స్వాతంత్ర్య సమరయోధులు శ్రీరామరెడ్డి 120వ జయంతిని పురస్కరించుకుని టోర్నీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఏపీఓ సంజీవరెడ్డి పాల్గొన్నారు.